క్లుప్తంగా

పకడ్బందీగా గ్రామసభలు

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల అభివృద్ధికి వినియోగించిన నిధులు, వ్యవసాయ కూలీల వేతనాలు వినియోగం, వివిధ రకాల పనులపై సామాజిక తనిఖీ గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023–24 ఆర్థిక సంవత్సరం సంబంధించి 18వ విడత సోషల్ ఆడిట్‌పై ఎస్సార్పీ, డీఆర్‌పీలకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు 20 గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి గ్రామసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండల స్థాయిలో ఈ నెల 7వ తేదీన ప్రజా ప్రతినిధుల సమక్షంలో సామాజిక బహిరంగ సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రవిప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లేగదూడల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి



లేగదూడల పెంపకం దారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): లేగదూడల పెంపుపై పాడి రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఏహెచ్‌ఓ గోవిందనాయక్ సూచించారు. పట్టణ సమీపంలోని రైతునగర్‌లో శుక్రవారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 40 లేగదూడలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా డీఏఎంఓ మాట్లాడుతూ లేగదూడలు ఆరోగ్యంగా, బలంగా ఉండేందుకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తూ ఉండాలని చెప్పారు. అనంతరం లేగదూడల పెంపకం దారులు అయిన 30మంది రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ వెంకటసుబ్బారెడ్డి, కానాల పశువైద్యాధికారి శ్రీనివాసులు, హరిబాబు చౌదరి, మధు, తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తులు చేసుకోండి

దొర్నిపాడు: కార్పొరేషన్ ద్వారా వెనుక బడిన తరగతులు (బీసీ), వెనుకబడిన అగ్రకులాలు (ఈబీసీ)వారు స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసి ఏర్పాటుకు కార్పొరేషన్ ద్వారా 50 శాతం రాయితీతో రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దొర్నిపాడు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వెనుకబడిన(బీసీ) 7 యూనిట్లకు రూ.42.65 లక్షలు, అలాగే గోస్పాడు ఏపీజీబీ 5 యూనిట్లకు రూ.23.25 లక్షలు, దొర్నిపాడు యూనియన్ బ్యాంకు 6 యూనిట్లకు రూ.34 ల క్షలు,కోవెలకుంట్ల యూనియన్‌బ్యాంకు 5 యూనిట్ల రూ.18.25 లక్షలు బ్యాంకుల వారీ గా కేటాయించినట్లు ఆమె తెలిపారు. అలాగే ఏడబ్ల్యూఎస్ వెనుకబడిన అగ్రకులాల (ఈ బీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణులు) వారి కోసం దొర్నిపాడు ఏపీజీబీ 1 యూనిట్‌గాను రూ.2 లక్షలు, దొర్నిపాడు యూనియన్ బ్యాంకు 1 యూనిట్‌కు రూ.1.50 లక్షలు కేటా యించినట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు రేషన్ కార్డు, కులం, ఆధార్ కార్డును జతపరచి ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు..

దుకాణాలకు వేలం పాట



వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీ పరిధిలోని 16 దుకాణాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ మురళీధర్, రెవెన్యూ అధికారి ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒక దుకాణాన్ని దక్కించుకునేందుకు మాత్రమే వ్యాపారులు ముందుకు వచ్చారు. దీంతో మిగిలిన 15 దుకాణాల వేలం పాట వాయిదా పండిందని రెవెన్యూ అధికారి ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్థానిక దేవనగర్‌కు చెందిన క్యాన్సర్ బాధితురాలు లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులి కొండన్న ఆధ్వర్యంలో శుక్రవారం రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పులికొండన్న మాట్లాడుతూ గత ఆరు రోజులుగా క్యాన్సర్ బాధితురాలు లక్ష్మమ్మ ఆరోగ్యం క్షీణించడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ మొదలు పెట్టకపోవడంతో బాధితురాలు తీవ్ర మనోవేదనకు గురవుతుందన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, పెద్దక్క, రవి, మధు, మల్లికార్జున, నగేష్, నాగార్జున పాల్గొన్నారు.

ఉప్పొంగిన భక్తి..

- వైభవంగా వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఊరేగింపు



నంద్యాలలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

నంద్యాల(వ్యవసాయం): వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు శుక్రవారం వేకువజామున నుంచే భక్తులతో కిటకిటలాడాయి. నంద్యాల పట్టణంలోని మెయిన్ బజార్ అమ్మవారి శాలలో శ్రీవాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అమ్మవారికి సుప్రభాతసేవ నిర్వహించి పల్లకీలో మేళతాళాలతో ఆలయం నుంచి చెరువు కట్ట వరకు 108 కలశాలు తీసుకొచ్చి జలాభిషేకం నిర్వహించారు. అదే విధంగా శ్రీనగరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి శ్రీసూక్త విధానంగా పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాల అభిషేకాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ట్రాఫిక్ సీఐ బాదానీ మల్లికార్జున గుప్తతో వైశ్య పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బాలికలతో లక్ష కుంకుమార్చన చేపట్టారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే నూనెపల్లె ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి శాలలో ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు, శాంతిహోమం, మహాపూర్ణాహుతి గావించారు. మహిళలతో సామూహిక కుంకుమార్చన, అమ్మవారికి మహా మంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు భవనాశి శ్రీనివాస్, బైసాని రామశేషు తదితరులు పాల్గొన్నారు.

- రుద్రవరం: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపడితులు విశ్వనాథ శర్మ, జగన్‌శర్మ తదితరులు ఆర్యవైశ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయాన్నే అమ్మవారికి నిత్య పూజలు గావించారు. సాయంత్రం పల్లకీపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చోళవేటి సూర్యనారాయణ,కోశాధికారి పెరుమాళ్ల నరసింహ్మయ్య, సంఘం పెద్దలు వెంకటరంగ నాయకులు పాల్గొన్నారు.



నూనెపల్లె అమ్మవారి శాలలో లక్షకుంకుమార్చన పూజలో మహిళలు



రుద్రవరంలో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం



చాగలమర్రిలో గణపతి హోమం..

అమ్మవారికి ప్రత్యేక పూజలు

- చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని శ్రీమత్కన్యాకాపరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వంకదార లక్ష్మణబాబు దంపతులు అమ్మవారికి వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఉదయం అమ్మవారికి ఉభయదారులు వల్లంకోండు దామోదర్, కూరపాటి లక్ష్మీనారాయణ, కూరపాటి సునీల్ బోనాదం రవి దంపతులతో గణపతి పూజ, స్వస్తివాచనం, ఆదిత్యాది నవగ్రహ ఆరాధన, కన్యకాపరమేశ్వరికి రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్రహోమం, లక్ష్మీ నారాయణహోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, మంత్రపుష్ప, పంచామృత, కలాశాభిషేకాలు నిర్వహింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, శ్రీఅయ్యప్పస్వామి సేవా సమాజం, ఆవోపా, ఆర్యవైశ్య మహిళా సంఘాల సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ముత్యాలపాడులో..

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ముత్యాలపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముడియం నరసింహారావు, కోశాధికారి మాధవ, ఉపాధ్యక్షులు రామకృష్ణ, మంచికంటి సురేష్‌బాబు, కార్యదర్శి గోపాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

వేడుకకు రారండోయ్



నెహ్రూనగర్‌లో నూతనంగా నిర్మించిన ఓంకారేశ్వరస్వామి గుడి

గోస్పాడు: గోస్పాడు మండలం నెహ్రూనగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవిశాలాక్షి సమేత ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. గ్రామస్తులందరూ కలిసికట్టుగా ఉండి రూ.2కోట్లు ఖర్చు చేసి ఈ దేవాలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో శనివారం నుంచి శ్రీకమలానంద భారతీ స్వాములు ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, దేవతామూర్తుల గ్రామోత్సవం, చెక్కభజన, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం నిర్వహించిత భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

పాఠశాలలను విలీనం చేయొద్దు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): సంస్కరణల పేరుతో ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయరాదని ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, కన్వీనర్ నగిరి శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర సభ్యుడు సాంబశివుడు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 117 జీవోతో ప్రాథమికవిద్య పూర్తిగా నాశనమైందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో 60మంది విద్యార్థులు పైబడిన పాఠశాలలను ఉన్న పాఠశాలలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 16,347 ఉపాధ్యాయ పోస్టులను టెట్, ఎస్సీ వర్గీకరణ సాకుగా చూపించి డీఎస్సీని కాలయాపన చేయడం పద్ధతి కాదన్నారు. వెంటనే నూతన నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న అధ్యాపక, బోధనేతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఏపీటీఎఫ్‌నాయకులు గోపాల్‌రావు, పుల్లయ్య, మునిస్వామి, రాముడు, నగిరి వెంకటేశ్వర్లు, రమణయ్యయాదవ్, విజయ్‌కుమార్, మాధవరెడ్డి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలి



వాలీబాల్ విభాగంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

మహానంది: ప్రతిభను కనబరచడానికి క్రీడా పోటీలు అద్భుత వేదిక అని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణ సాగర్ అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి ఆధ్వర్యంలో మూడో రోజు క్రీడా పోటీలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారని, ఆత్మవిశ్వాసం పెంపొందడానికి ఈ పోటీలు ఎంతో దోహద పడతాయని అన్నారు.

విజేతలు వీరే..

క్రీడా పోటీల్లో శుక్రవారం విజేతలను ప్రకటించారు. బ్యాడ్మింటన్, 100 మీటర్స్(గరల్స్), షాట్‌పుట్(గరల్స్) ఊటుకూరు అగ్రి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విజయం సాధించారు. క్యారమ్స్(బాయ్స్)లో మార్టూరు, చెస్(బాయ్స్) అనకాపల్లి, టేబుల్ టెన్నిస్(బాయ్స్) మడకశిర, లాంగ్ జంప్(గరల్స్) రామగిరి, డిస్కస్ త్రో(గరల్స్) పాదలకూరు, వాలీబాల్‌లో రంపచోడవరం విద్యార్థులు విజయం సాధించారని అసోసియేట్ డీన్ డాక్టర్ వీరజయలక్ష్మి తెలిపారు.

దిగుబడుల ఆధారంగా పంటబీమా

నంద్యాల(అర్బన్): పంట కోత ప్రయోగంలో వచ్చిన దిగుబడి ఆధారంగా శనగకు పంట బీమా వర్తిస్తుందని ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రణాళిక అధికారి వేణుగోపాల్ రైతులకు చెప్పారు. నంద్యాల మండలం మూలసాగరం గ్రామంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద యూనిట్ నెంబరు 64లో స్థానిక రైతు వీరారెడ్డి పొలంలో శుక్రవారం శనగ పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు దశల్లో పంట కోత ప్రయోగం నిర్వహించగా మొదటి దశలో 2.100, రెండో దశలో 1.850, మూడో దశలో 1.470, నాలుగో దశ ప్రయోగంలో 1.350 కిలో గ్రాములు దిగుబడులు వచ్చాయి. అనంతరం జరిగిన కార్యక్రమంలో వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి రైతు పంట కోత ప్రయోగాలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ రమణయ్య, ఏఎస్‌ఓ ప్రహ్లాద, ఏఈఓ రవికుమార్, ఎంపీఈఓ ఇంద్రాణి, వీఆర్‌ఓ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం



ఆర్.జంబులదిన్నె సమీపంలో ప్రమాదకరంగా రహదారి మలుపు

ప్రమాద హెచ్చరిక ఏదీ?

ఉయ్యాలవాడ : పెద్దయమ్మనూరు– ఆర్.జంబులదిన్నె రహదారిలోని కల్వర్టు సమీపంలో ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో వాహనాల రద్దీ నిత్యం ఉంటుంది. పలు పర్యాయాలు వాహనాలు ఢీకొనడం, బోల్తా పడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. మలుపు వద్ద వేగ నియంత్రణకు సంబంధించి సూచిక బోర్డులు లేవు. దీంతో వాహనదారులు వేగంగా వెళ్లి మలుపు వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్య తీవ్ర కాక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పరిమళించిన మానవత్వం



అనాథ శవాన్ని అంత్యక్రియలు నిర్వహించేందుకు తీసుకెళ్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ఆమె ఓ అనాథ. కొన్ని సంవత్సరాలుగా ఆళ్లగడ్డ పట్టణంలోని సంతమార్కెట్‌లో ఉంటోంది. అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందింది. అనాథ కావడంతో అంత్యక్రియలు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న అమ్మ సేవా ఫౌండేషన్ సంస్థ నిర్వాహకుడు బిజ్జల నగేష్ ముందుకు వచ్చి మృత దేహాన్ని తన ఆటోలో వేసుకుని పట్టణ శివారులోని శ్మశానంలో సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించడంతో పలువు అభినందనలు తెలిపారు

వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై శుక్రవారం ఇండోర్ స్టేడియంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు సంఘం నూతన క్యాలెండర్‌ను శాప్ చైర్మన్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఏపీరెడ్డి, నంద్యాల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు, గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, నాయకులు చింతనాగేంద్ర,దండె నాగరాజు, విశ్వనాథ్, భరత్‌రెడ్డి, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాసులు, దేవేంద్ర, యోగా గురువు రమేష్, పీఈటీలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోతిరెడ్డిపై హత్యాయత్నం కేసు

కొలిమిగుండ్ల: బెలుంకు చెందిన పారిశ్రామికవేత్త పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిపై శుక్రవారం పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వివరాలు.. బెలుం– బెలుం శింగవరం గ్రామాల మధ్యలో బెలుంకు చెందిన బాచం ప్రతాప్‌రెడ్డి నాపరాతి గని నిర్వహిస్తున్నాడు. వెంకటసుబ్బారెడ్డి, సాయిబాబా గని వద్దకు వెళ్లి హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించారు. ఈ మేరకు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి 2014–19 వరకు టీడీపీలో కొలిమిగుండ్ల మండలంలో క్రియాశీలకంగా పని చేశాడు. 2024లో ఎన్నికల కంటే ముందుగా నెల కొన్న పరిణామాల వల్ల టీడీపీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన తండ్రి పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి పేరు మీద కొలిమిగుండ్లలో సేవా ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. సీనియర్ నాయకుడు, పారిశ్రామికవేత్త అయిన వెంకటసుబ్బారెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు కావడంతో మండలంలో చర్చనీయాంశమైంది.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కొత్తపల్లి: అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.కేశవ తెలిపారు. మండలంలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన ఈడిగ చంద్రగౌడ్ ఆత్మకూరులోని ఓ వైన్‌షాపు నుంచి మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి, వాటిని కొత్తపల్లి మీదుగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎం.లింగాపురం గ్రామం ఆటోస్టాండ్ వద్ద నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నామన్నారు. తనిఖీ నిర్వహించగా 8 మద్యం బాటిళ్లు లభ్యం కావడంతో స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఆర్‌డీఓ విశ్వనాథ్

నంద్యాల(అర్బన్): ఈనెల 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను కలిసికట్టుగా విజయవంతం చేద్దామని నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం పలు శాఖల అధికారులతో మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానంది క్షేత్రాన్ని సందర్శించే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోందని, వారికి సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల సంఖ్య అత్యధికంగా ఉంటుందని, వాహనాల సంఖ్యను బట్టి సౌకర్యాలు కల్పించాలన్నారు. భద్రతా చర్యలలో భాగంగా పలు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మహానంది ఈఓ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ, పంచాయతీ, పోలీసు, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లోకి తహసీల్దార్ కార్యాలయం



బీసీ బాలికల వసతి గృహం



శిథిలమైన తహసీల్దార్ కార్యాలయం

దొర్నిపాడు: మండలంలో తహసీల్దార్ కార్యాలయం కీలకం. అయితే, ఈ కార్యాలయానికి కొన్నేళ్లుగా సొంత భవనం లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో రెండు మూడు గదులు తీసుకొని విధులు కొనసాగిస్తున్నారు. 2019 ఎన్నికల ముందు నూతన కార్యాలయం నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం ఉన్న కార్యాలయాన్ని కూల్చి వేసింది. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో నిధులు వెనక్కి వెళ్లాయి. ఫలితంగా అప్పటి నుంచి రెవెన్యూ సిబ్బంది ఎంపీడీఓ కార్యాలయంలో చాలీచాలని గదుల్లో కార్యకలాపాలు సాగిస్తున్నారు.

ఖాళీగా బీసీ బాలికల వసతి గృహం

2006లో బీసీ బాలికల కోసం మండల కేంద్రం దొర్నిపాడులో బీసీ బాలికల వసతి గృహన్ని నిర్మించారు. మొదట్లో బాలికలు పెద్దసంఖ్యలో ఈ గృహంలో ఉంటూ విద్యను కొనసాగించేవారు. రానురాను బాలికలు హాస్టళ్లో చేరడం తగ్గించారు. దీంతో బాలికల సంఖ్య పూర్తిగా పడిపోవడంతో ఇటీవలే వసతి గృహాన్ని ఆళ్లగడ్డకు మార్చారు. దీంతో ఖాళీగా ఉన్న ఈ వసతి గృహాన్ని తహసీల్దార్ కార్యాలయానికి బాగుంటుందని ఎమ్మెల్యే అఖిలప్రియ సహకారంతో ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. పాత తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉండటంతో ప్రజలకు అనుకూలంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



రూపనగుడిలోని ఓ రైతు పొలంలో వరి నాట్లు వేస్తున్న మోడల్‌స్కూల్ విద్యార్థులు

పొలంలో దిగి.. వరినాట్లు వేసి

ఉయ్యాలవాడ : చదువుల్లో, ఆటల్లో రాణించే విద్యార్థులు శుక్రవారం పొలం బాట పట్టారు. మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు రూపనగుడి గ్రామ సమీపంలో ఓ పొలంలో దిగి వరి నాట్లు వేశారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. వరి సాగులో పాటించే పద్ధతులు, ఎరువుల వినియోగం, పంటలకు ఆశించే తెగుళ్లు, తదితర వాటి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అగ్రికల్చర్ ట్రైనర్ హుసేన్‌వలి ఆధ్వర్యంలో విద్యార్థులకు పొలాల సాగుపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్ వెంకటరమణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన రాగసుధ డ్యాన్స్ అకాడమీ వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వినాయక కౌత్వం, శివస్తుతి, నటేశకౌత్వం, శివ శివ శంకరా, నమఃశివాయతే తదితర గీతాలకు ప్రవళిక, బిందు, అద్వైత, నవ్య, వర్షిక, శరణ్య, లక్ష్య, శ్రీనిఖ, చైత్ర, లలిత నృత్యప్రదర్శన ప్రదర్శించారు.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం

మహానంది: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఈఓ శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆలయ ప్రాంగణంలో పర్యటించారు. వసతి గృహాలలో సేదతీరే భక్తుల కోసం దుప్పట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నేటి నుంచి మహాసభలు

నందికొట్కూరు: నెల్లూరు జిల్లాలో 1, 2, 3వ తేదీలలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతాంగ, కౌలు, వ్యవసాయ కార్మికులు, సామాన్య మధ్యతరగతి, ప్రజల సమస్యలపైన, ఇంటి స్థలాల కోసం నిరంతరం పోరాటం చేయనున్నట్లు చెప్పారు. పట్టణంలోని నిరుపేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి పక్కా గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పూరి గుడిసెలో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆయా కాలనీల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, కర్ణ, ఓబులేసు, బాబు, ఉస్మాన్‌బాషా, బాలయ్య పాల్గొన్నారు.